పరిగెడుతున్నాయ్. పదకొండయింది. ఇక ఆనందబాబు ఆగ లేకపోయేడు.

"మేస్టారూ....మీరెక్కడి కెళ్ళాలి?" అంటూ గుర్నాధా న్నడిగేడు. ఉన్నవాడు ఆరుస్తాడా తీరుస్తాడా అనుకున్నా ఎప్పటికప్పుడు వాడు మాటాడ్తే భుజాలు పొంగిపోతాయి మధ్యవాడికి.

"తాలూకాఫీసుకు బాబూ...." అన్నాడు వినయంగా.

ఒక గడియ చెప్పడమా మానడమా అని ఆలోచించి నీళ్లు నమిలి కాస్త హోదాలో...."చిన్న హెల్ప్ చేస్తారేవిటి.... మరేంలేదు, ఆ రిక్షా కాస్త కుదురుస్తారూ...మీకూ అర్జెంటైతే ఈ రిక్షాలోనే వద్దురుగాని" అన్నాడు.

మీదివాడికి తెలుసు ఎవర్నెక్కడ గురిచూసి కొడితే ఎలా పన్జేస్తాడో. "అబ్బెబ్బే....సే నెందుకండి....పైగా నా సైకిలూ.... రిక్షా మాటాడుతానుండండి... ఇంతకీ మీరెక్కడి కెళ్ళాలి బాబూ...."

"మా ఫేక్టరీకి..." అంటూ ఇంకేదో చెప్పబోయేడు ఆనందబాబు.

"ఓహో...." అనుకుని "ఒరేయ్ బాబూ పూరి చివర ఫేక్టరీకి కడతావురా" అంటూ "ఎంత?" అనడిగేడు గుర్నాధం.

'ఏటి నువ్వు రిక్షా ఎక్కుతావేటి, మొహం సూడ్డా' అన్నట్టుగా చూసి, "మూడ్రూపాలు" అన్నాడు కేర్‌లెస్‌గా రిక్షా రంగన్న.

"ఎంత వర్షమైతేమాత్రం అంతెక్కువేమిట్రా....ఆ బాబు రోజూ వెళ్తున్నదేగదా రూపాయిన్నరకి...." అన్నాడు గుమస్తా.

"అల్లాగవుతే మూడ్రూపాలే....ఇష్టవయితే ఎక్కమను. కష్టవయితే మానీమను." అంటూ కుండ పగలేసేడు 'నీ కయితే అద్దు రూపాయైనా తగ్గిద్దునేమో' అన్నట్టుగా.

ఆనందబాబు స్కూటర్ లాక్ చేసి మాటాడకుండా దర్జాగా రిక్షా ఎక్కికూర్చున్నాడు. "మీరూ రండి....డ్రాప్ చేస్తాను." అన్నాడు తొంగిచూస్తూ ఫార్మాలిటీకి...మనసులో మాత్రం 'వీడు రాకపోతే బాగుణ్ణు' అనుకుంటూ.

"అబ్బే, లేదు బాబూ. మీరు వెళ్ళి రండి...ఒరేయ్ లాగించరా రిక్షా..."అంటూ సగం ఏడుపు ముఖంతో రిక్షావాణ్ణి కేకేసాడు.

గుమస్తా గుర్నాధం ఒక్కడూ మిగిలేడు. జమాబందీకి ఆలస్యం అయినందుకు పడే తిట్లూ, వచ్చే శ్రీముఖాలూ ఊహించుకుంటే పడుతున్న వర్షానికి నాలుగింతలుగా కనిపించని వర్షాన్ని కురిపిస్తున్నాయి అతని కళ్ళు.

వర్షం ఇంకా బాదుతూనే వుంది. రేకుల షెడ్డు, ఉన్నవాడిలా యింకా డబ్బాకొడుతూ డబడబ లాడుతూనేవుంది. దానికి ఎదురుగా గుడిసె కూడా అలానే వుంది.

కాని....కాని....కరువొచ్చినా, ఖరీదులెక్కువైనా, యుద్ధాలొచ్చినా, ఉత్పాతాలు ముంచినా, విప్లవాలొచ్చినా, వింతలు జరిగినా, సమ్మెలు చేసినా, షోకులు మారినా నలిగిపోయేదీ.... చితికిపోయేదీ....చివరికి ఆహుతయేదీ మధ్యతరగతివాడే నన్నంత సహజంగా ఆ ప్రక్క నున్న మట్టిగోడల పెంకుటిల్లు మాత్రం కూలిపోయింది.